సాక్షి వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 1 । జూన్ । 2025



ప్రజల్లోకి ప్రజా వ్యతిరేక విధానాలు

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

-8లో



మీ సేవలు చిరస్మరణీయం

సుదీర్ఘ కాలంపాటు పోలీస్ శాఖకు విశేష సేవలందించారని, మీ సేవలు మరువలేమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు.

-8లో

గరిష్టం/కనిష్టం
36.2/25.5

వాతావరణం

జిల్లాలో శనివారం 25.5 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆచార్య శ్రీనివాస్



కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ నియమితులయ్యారు. విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాస రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల పత్రాలను ఆచార్య శ్రీనివాస రావు, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ.. శ్రీనివాస్‌కు అందజేశారు. ప్రిన్సిపల్ పోస్టుతోపాటూ కడపలోని వై.వి.యు. హాస్టళ్ల (బాలురు, బాలికలు) చీఫ్ వార్డెన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇదివరకు ప్రిన్సిపల్ , వసతిగృహాల చీఫ్ వార్డెన్‌గా పనిచేసిన ఆచార్య ఎస్ రఘునాథ్ రెడ్డి పదవీకాలం పూర్తి కావడంతో ఆ బాధ్యతల నుంచి ఆయన రిలీవ్ అయ్యారు.

2న డీఈఈ సెట్ పరీక్ష



కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ కడప జిల్లాలో డీఈఈ సెట్-2025 (కంప్యూటర్ బేస్డ్ టెస్టు)పరీక్ష జూన్ 2వ తేదీ 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నామని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. సంబంధిత పరీక్ష మూడు సెంటర్లలో నిర్వహించనున్నామని తెలిపారు. డీఈఈ సెట్-25 అభ్యర్థులు హాల్ టికెట్లను https://apdeecet.apcfss.in/ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. నామినల్ రోల్స్‌లో పేరు, పుట్టిన తేదీ, లింగం వంటి ఏవైనా సవరణలు ఉంటే పరీక్షా కేంద్రంలో సరిదిద్దుకోవచ్చన్నారు. హాల్ టికెట్‌తో పాటు అభ్యర్థులు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు(ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, ఓటర్ కార్డు) తమ వెంట పరీక్ష హాల్‌కు తీసుకొని రావాలని తెలిపారు. అభ్యర్థులు వారికి సంబంధిత పరీక్ష తేదీ , సెంటర్‌ను సరిచూసుకుని నిర్ణీత సమయంకంటే అరగంట ముందే పరీక్ష సెంటర్‌కు హాజరుకావాలని డీఈఓ తెలిపారు.


నేడు వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో 'ఫ్యామిలీ యోగా'



వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం

కడప సెవెన్‌రోడ్స్: కడపలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం మైదానంలో ఆదివారం నిర్వహించే 'ఫ్యామిలీ యోగా' కార్యక్రమంలో ఆసక్తి కలిగిన వారు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. 'యోగాంధ్ర- 2025' మాసోత్సవాల్లో భాగంగా.. ప్రత్యేకించి ఈ ఆదివారం (జూన్ 1వ తేదీ) ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఫ్యామిలీ యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులు, అవ్వాతాతలు మొదలైన మూడు కేటగిరీలకు చెందిన కుటుంబ సభ్యులు కలిసి పాల్గొనాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జూన్ 21 వరకు జరిగే ఈ యోగా కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని, అంతర్జాతీయ యోగా వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ప్రతిఒక్కరూ యోగా ఆవశ్యకతను తెలుసుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలన్నారు.

మార్కెట్లకు వరదలా టమాట



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమాట

బి.కొత్తకోట: ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులకు టమాట వరదలా వచ్చి పడుతున్నాయి. ధరల్లో పెరుగుదల లేనప్పటికి పంట దిగుబడులు భారీగా వస్తున్నాయి. దీంతో శనివారం ఒకరోజే 5,480 టన్నులు విక్రయానికి వచ్చాయి. మదనపల్లె మార్కెట్‌కు 1,750 టన్నులు, వి.కోట మార్కెట్‌కు 132, పలమనేరు మార్కెట్‌కు 460, పుంగనూరు మార్కెట్‌కు 1,568, ములకలచెరువు మార్కెట్‌కు 1,580, బి.కొత్తకోట మార్కెట్‌కు 25 , అంగళ్లు మార్కెట్‌కు 40 టన్నులు వచ్చాయి. కాగా ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. మదనపల్లెలో కిలో టమాట రూ.6.20 పైసలు, వి.కోటలో కిలో రూ.7, పలమనేరులో కిలో రూ.7.50 పైసలు, పుంగనూరులో కిలో రూ.6.70పైసలు, ములకలచెరువులో కిలో రూ.8.50 పైసలు పలికింది.

అన్నదాత దుఃఖీభవ!



నా పేరు దాసరి గంగయ్య. మాది పొద్దుటూరు మండలం కానపల్లె గ్రామం. నాకు మూడు ఎకరాలు పొలం ఉంది. గతేడాది వరిపంటను సాగు చేశాను. పంటలసాగు సమయంలో పెట్టుబడి సాయం అందలేదు. దీంతో అప్పు చేసి పంటను సాగు చేశాను. తరువాత కూడా పెట్టుబడి సాయం అందలేదు. మళ్లీ ఇప్పుడు ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభం అవుతుంది. ఈ ఏడాదైనా పంటలసాగుకు అన్నదాత సుఖీభవ నిధులను ప్రభుత్వం విడుదల చేసి ఆదుకోవాలి.

- ఏడాదైనా నయా పైసా విదల్చని సర్కార్
- గత ఖరీఫ్, రబీలకు సంబంధించి దాదాపు రూ. 250 కోట్ల ఎగవేత
- అన్నదాత ఆశలను అడియాసలు చేసిన బాబు ప్రభుత్వం
- జిల్లాలో ఈ ఏడాది 1,28,084 హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగు
- ఎప్పటికప్పుడు రైతు భరోసాతో ఆదుకున్న గత ప్రభుత్వం
- ఈ ఏడాది ఖరీఫ్ పెట్టుబడికి రైతన్నల ఎదురుచూపు



కడప అగ్రికల్చర్: రైతులంటే కూటమి ప్రభుత్వానికి ఎప్పిటికీ చిన్నచూపే. అది నిజమని మరోసారి నిరూపణ అయింది. ఎందుకంటే కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటికీ అన్నదా తలకు పెట్టుబడి సాయానికి ఒక్క రూపాయి విదల్చ లేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందచేస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా అన్నదాతలకు నయాపైసా విదల్చలేదు.

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖరీఫ్, రబీ రెండు సీజన్లు ముగిశాయి. రెండు సీజన్లకు ఒక్క రూపాయి కూడా విడదల కాకపోవడంతో పంటల పెట్టుబడికి అన్నదాతలు అప్పు తెచ్చుకుని పంటలను సాగు చేసుకున్నారు. మళ్లీ ఖరీఫ్ సీజన్ కూడా మరో రెండు రోజుల్లో ఆరంభంకానుంది. ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందే రుతుపవనాలు రావడంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కూడా ఆరంభమయ్యాయి. ఇక రైతులు కూడా కాడి సిద్ధం చేసుకుని పంటల సాగుకు సన్నద్ధమౌతున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదలపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ ఈ సారి కూడా పెట్టుబడికి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్న దాత సుఖీభవ నిధులను సకాలంలో విడుదల చేసి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో...

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో పంటల సాగుకోసం క్రమం తప్పకుండా పెట్టుబడి సాయం అందించింది. ప్రతి ఏటా ఖరీఫ్ ఆరంభం లోనే పెట్టుబడి సాయాన్ని అందించి పంటల సాగుకు చేయూత నిచ్చింది. కానీ కూటమి ప్రభుత్వంలో పంటల సాగుకు అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. దీనికితోడు గత ఖరీఫ్, రబీ సీజన్లలో అకాల వర్షాలు, తుఫాలతో రైతులు తీవ్రంగా నష్టాలను చవి చూశారు. వారిని కూడా కూటమి ప్రభుత్వం ఆదుకోలేదు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇవ్వలేదు. దీనికితోడు అన్నదాత సుఖీభవ నిధులు ఇవ్వలేదు. దీంతో అటు అన్నదాత సుఖీభవ రాక ఇటు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వక అన్ని రకాలుగా అన్నదాతలు నష్టపోయారు.

తంచన్‌గా కేంద్ర ప్రభుత్వ సాయం...

పీఎం కిసాన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు తంచన్‌గా సాయం అందిస్తోంది. ఇందులో భాగంగా మూడు విడతల్లో 6 వేలు సాయం అందచేస్తామని ప్రకటించింది. ఈ మేరకు జూన్ నెలలో రూ. 2 వేలు, అక్టోబర్‌లో 2 వేలతోపాటు మార్చి నెలలో మూడవ విడతను విడుదల చేసింది. అయితే ఖరీఫ్, రబీ సీజన్లు ముగిసినా రూ. 20 వేలు చొప్పన సాయం అందిస్తామన్న చంద్రబాబు పట్టించుకోకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మేనిఫెస్టోలో ...



కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో సూపర్‌సిక్స్‌లో భాగంగా ప్రతి రైతుకు ఏటా రూ. 20 వేలు ఆర్థికసాయం రైతు ఖాతాలకు జయచేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే పట్టనట్లు వ్యవహరించడంతో అన్నదాతల్లో ఆందోళన చెందారు. కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి దాదాపు ఏడాది కావస్తున్నా రైతులకు ఒక్క రూపాయి సాయంగా అందించలేదు. గతంలో వ్యవసాయమే దండగ అన్న చంద్రబాబు సర్కారు మరోసారి అదే తీరున వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్ కడప జిల్లాలో...



వైఎస్సార్ కడప జిల్లాలో 36 మండలాల పరిధిలో దాదాపు రెండు లక్షలకు పైగా రైతులు ఉన్నారు. రెండు లక్షల హెక్టార్లకుపైగా సాగు భూమి కూడా ఉంది. అయితే రైతులు పంటల సాగులో విత్తనాలు, ఎరువులు, కూలీలతోపాటు పలు పనులకు నగదు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంత వరకు పెట్టుబడి సాయం అందకపోవడంతో పెట్టుబడి కోసం కొంత మంది రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవడంతోపాటు ఇళ్లలోని బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సూపర్‌సిక్స్‌లో చెప్పినట్టుగా సాయం విడుదలకు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

గత ప్రభుత్వం ఆరంభంలోనే పెట్టుబడి సాయం...



రైతులు పంటలసాగు కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా) అందించి అన్నదాతలకు అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం కింద రూ. 6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 7500 మొత్తం కలిపి ఏడాదికి రూ. 13500 రైతు ఖాతాలకు జమ చేసేది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతు ఖాతాలకు జమచేసేది. ఇందులో ఖరీఫ్ ఆరంభంలో, రెండవది కోతల సమయంలో, మూడవది ధాన్యం ఇంటికి చేరే వేళ ఇలా రైతుల ఖాతాలకు జమ చేసేవారు. ఇలా వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసా కింద ఐదేళ్ల పాటు రూ. 1191.03 కోట్లను అన్నదాతలకు అందించి అండగా నిలిచింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రాష్ట్రవాట కింద రూ. 14 వేలు అందిస్తామని ప్రకటించింది. కానీ నయాపైగా విదల్చకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు వివరాలు...

సంవత్సరం	రైతుల సంఖ్య	విడుదలైన నిధులు (రూ. కోట్లలో)
2019-20	2,06,708	279.93
2020-21	2,08,747	280.06
2021-22	1,99,344	269.11
2022-23	2,02,598	235.68
2023-24	2,10,481	126.25

సకాలంలో విడుదల చేయాలి...



అన్నదాత సుఖీభవ నిధులను ఈ ఏడాది సకాలంలో విడుదల చేయాలి. సకాలంలో వర్షాలు కూడా వస్తున్నాయి. పెట్టుబడికి రైతులు అప్పులు చేసుకోకుండా అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేసి రైతుల ఖాతాలకు జమ చేస్తే మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి.

- పండింటి నారాయణ, చిన్న వరదాయపల్లె, చాపాడు మండలం

రైతులను ఆదుకోవాలి...



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడిసాయం కింద అందించే అన్నదాత సుఖీభవ నిధులను సకాలంలో విడు దల చేసి అన్నదాతలను ఆదు కోవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇంకా ఇంత వరకు నిధులను విడుదల చేయలేదు. ఈ ఏడాదైనా సకాలంలో విడుదల చేసి రైతులు అప్పులు చేసుకోకుండా చూడాలి.

- పోతిరెడ్డి భాస్కర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి (సీపీఐ అనుబంధ, రైతు విభాగం)

ఏడాది కావస్తున్నా...



గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో జమ అయ్యేది. ఇప్పుడు అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా రైతు ఖాతాలకు నగదు జయ చేయకుండా రైతుల పట్ల మీనమేషాలు లెక్కిస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు రైతు ఖాతాలకు జమచేయాలి.

- దస్తగిరి రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కడప

ఆర్థిక సాయం అందించాలి..



ఖరీఫ్ పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఆర్థిక సాయం అందక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఖరీఫ్ నాటికే రైతుభరోసా నగదు బ్యాంకు ఖాతాలో జమ అయ్యేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుభరోసా పేరు మార్చి అన్నదాత సుఖీభవ అని పెట్టారు. అయితే ఇంత వరకు అతీగతీ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ నిధులు అందించాలి.

- డి.చెంచయ్య, రైతు, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

జిల్లాలో వర్షం



కడప అగ్రికల్చర్: రుతు పవనాల ఆగమనంతో జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు అధికారులు తెలిపిన వివరాల మేరకు వర్షపాతం ఇలా.. దువ్వూరులో 64.2 ఎంఎం అత్యధికంగా వర్షం కరిసింది. అలాగే వేములలో 48.4 ఎంఎం, కలసపాడులో 41.2 , మైదుకూరులో 37.0 , రాజుపాలెంలో 36 , కాశినాయనలో 34.8 , పులివెందుల్లో 34.2 , పెండ్లిమర్రిలో 32.2 , పెద్దముడియంలో 30.4 , ముద్దనూరులో 29.8 , బిమతంలో 28.2 , లింగాల్లో 25.2 , వేంపల్లిలో 22.2 , వీఎన్‌పల్లి 20.4 , అట్లూరులో 19.8 , బి. కోడూరులో 16.4 , పోరుమామిళ్లలో 15.2 , కొండాపురంలో 12.8 , గోపవరం 11.2 , సిద్దవటంలో 10.2, చాపాడులో 8.6 , పొద్దుటూరులో 8.4 , ఒంటిమిట్ట 7.2 , కడపలో 6.4 , ఖాజీపేటలో 5.6 , వల్లూరులో 3.4 , కమలాపురంలో 2.2 ఎంఎం వర్షపాతం నమోదయింది.

అత్యుత్తమ గ్రామంగా తీర్చిదిద్దుతాం

కలెక్టర్ శ్రీధర్



గ్రామ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

జమ్మలమడుగు రూరల్: ఆదర్శ గ్రామం అయిన ఎస్. ఉప్పలపాడు గ్రామాన్ని అత్యుత్తమ గ్రామంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. శనివారం జమ్మలమడుగు మండల పరిధిలోని ఎస్. ఉప్పలపాడు గ్రామంలో ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీతో కలసి గ్రామంలోని పలు కాలనీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీ4 విధానం ప్రవేశపెట్టిందని.. తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పేదరికాన్ని తొలగించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. సమాజంలో ఉన్న పేదవారి అభ్యున్నతికి ధనికులు తోడ్పడాలన్నారు. గ్రామంలోని యువతీ యువకులు బాగా చదువుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, మయాలూరు రామ మనోహర్‌రెడ్డిలు గ్రామాన్ని గతంలో దత్తత తీసుకుని గ్రామంలోని ప్రజలకు మౌళిక వసతులు కల్పించారన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాలకు ప్రహరీ ఏర్పాటుచేయాలని, పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రజలు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీబీహెచ్ఎల్‌సీ మాజీ చైర్మన్ ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి, తహసీల్దార్ పి. శ్రీనివాసులు రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్, సర్పంచ్ అక్కల దేవి, ఎంపీడీఓ సయ్యద్ ఉన్నీసా పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ల ఆవిష్కరణ

- 4వ తేదీన అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు
- విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుల పిలుపు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధ

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు జూన్ 4న 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు ఆవిష్కరించారు. శనివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2025 జూన్ 4 నాటికి ఏడాది పూర్తవుతుందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతోపాటు 143 ఇతర హామీలు ఇచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు అన్ని లెక్కలు చూసుకున్నాము, సంపద సృష్టించి ప్రజలకు ఇచ్చిన హామీలను ఖచ్చితంగా నెరవేరుస్తామని చెప్పారన్నారు. హామీలు అమలు చేయకపోతే చొక్కా పట్టి నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను వీరు నట్టేట ముంచారన్నారు. ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని నిరసిస్తూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీలు చేపట్టి, అధికారులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మూల్యాంకనం చేసేందుకు కూడా చేతకాలేదు

మూల్యాంకనం సక్రమంగా చేసి పదో తరగతి పేపర్లు దిద్దేందుకు కూడా ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. పదవ తరగతిలో రీ వెరిఫికేషన్‌కు 66వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో 11500 మంది పాస్ అయ్యారన్నారు. ఆలోపే ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి గడువు దాటిపోయిందని, విద్యార్థుల ఆందోళనతో గడువు పెంచారన్నారు. ఒక విద్యార్థికి అన్ని సబ్జెక్టుల్లో 90కిపైగా మార్కులు వచ్చాయని, సోషల్‌లో మాత్రమే 22 మార్కులు వచ్చాయన్నారు. అడిషనల్ పేపర్లు కౌంట్ చేయకపోవడం వల్లే ఆ విద్యార్థికి తక్కువ మార్కులు వచ్చినట్లు రీవెరిఫికేషన్‌లో తేలిందన్నారు. ఇంత బాధ్యతారహితంగా పేపర్లు దిద్ది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. దరఖాస్తు చేసిన వారి పేపర్లలోనే ఇన్ని తప్పులు ఉంటే దరఖాస్తు చేయని వారు చాలామందే ఉన్నారన్నారు. ఆ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మానసిక క్షోభ ఈ ప్రభుత్వానికి తగులుతుందన్నారు. గతంలో ఒక రైలు ప్రమాదం జరిగితే దానికి బాధ్యత వహిస్తూ సంబంధిత రైల్వే మంత్రి రాజీనామా చేశారని, మూల్యాంకనంలో తప్పులు దొర్లినందుకు టీచర్లను సస్పెండ్‌చేస్తే సరిపోదని, విద్యాశాఖామంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించి గత ఏడాది ఇచ్చిన ఒక్క సిలిండర్ డబ్బులు కూడా చాలామంది ఖాతాల్లో వేయలేదన్నారు. ఎన్నికల ముందు చదువుకునే ప్రతి ఒక్కరికి తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, 20లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. పైగా వలంటీర్లు, రేషన్ వాహనాల డ్రైవర్ల ఉద్యోగాలు ఊడగొట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్‌కుమార్, యానాదయ్య, ఎస్. వెంకటేశ్వర్లు, శంకర్‌రెడ్డి, సీహెచ్ వినోద్, బంగారు నాగయ్య, దాసరి శివప్రసాద్, షఫీ, పత్తి రాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, బి. మరియలు, సునీత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ



కడప సెవెన్ రోడ్స్: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జూన్ 1వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీని రేషన్ షాపుల ద్వారా మాత్రమే పంపిణీ చేయనున్నట్లు జేసీ అదితిసింగ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రేషన్ పంపిణీ కార్యక్రమం డీలర్ల ద్వారా ఆదివారాలు, సెలవు దినాలతోసహా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్నామన్నారు. నిత్యావసర సరుకులు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కార్డుదారులకు పంపిణీ చేస్తామన్నారు. పోర్టబిలిటీ సౌకర్యం అందుబాటులో ఉన్నందున, కార్డుదారులు తమకు సమీపంలోని ఏ రేషన్ షాప్ నుండైనా సరుకులు పొందవచ్చని, ఈ సౌకర్యాన్ని రైస్ కార్డుదారులందరూ సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. 65 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు లేదా అంగ వైకల్యం ఉన్నవారు లేదా అనారోగ్యంతో మంచం మీద ఉన్న కార్డుదారుల ఇంటి వద్దకే.. డీలరు 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల్లోగా రేషన్ సరుకులను పంపిణీ చేస్తారని జేసీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ ఈఈలుగా అదనపు బాధ్యతలు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో ఇద్దరు ఈఈలు శనివారం ఉద్యోగ విరమణ చేయడంతో వారి స్థానాల్లో ఇద్దరికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జీవీ శ్రీనివాసులురెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మలమడుగు పీఆర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్న ఎం.శ్యామసుందర్‌రాజు రిటైర్డ్ అయ్యారు. రాజంపేట పీఆర్ఐ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ఎం.రామచంద్రనాయక్‌కు జమ్మలమడుగు ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఎఫ్ఏసీగా వ్యవహరిస్తారు. ఇప్పటిదాక జమ్మలమడుగు పీఆర్ఐ డివిజన్ ఈఈగా ఉన్న శ్యామసుందర్‌రాజు పులివెందుల పీఆర్ఐ డివిజన్ ఈఈ ఎఫ్ఏసీగా ఉండేవారు. ఆయన రిటైర్డ్ కావడంతో రాయలసీమ పీఆర్ఐ డివిజన్ ఈఈ ఎం.దయాకర్‌రెడ్డిని పులివెందుల ఈఈ ఎఫ్ఏసీగా నియమించారు.

క్లుప్తంగా

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

– ఇద్దరికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు కొత్త బస్టాండ్ సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ఉన్న హుస్సేన్ పీరా, హరిలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దనూరు రోడ్డులోని జయమ్మ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంలో హుస్సేన్ పీరా, హరిలు వస్తుండగా.. ఆర్టీసీ బస్టాండులోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో వీరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు సిఫార్సు చేశారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైలు కిందపడి మృతి చెందిన వ్యక్తి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప-కమలాపురం రైలు మార్గంలోని గంగాయపల్లె యార్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తి (50) శనివారం గూడ్స్ రైలు కింద పడి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తు పట్టిన వారు 94409 00811 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి శనివారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడిని (70) తీసుకుని వచ్చారు. అతన్ని పరీక్షించిన డాక్టర్లు చనిపోయాడని నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. అతని వివరాలు తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు సూచించారు.

అదుపు తప్పి వాహనం బోల్తా

– ఒకరి మృతి

సిద్దవటం : సిద్దవటం గ్రామ శివారులోని ఉషా గార్డెన్ వద్ద శనివారం బొలేరో పికప్ లగేజీ వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో అందులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో జింకా చంద్ర(44) అనే వ్యక్తి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. డప ఉక్కాయపల్లె వైఎస్ఆర్ కాలనీకి చెందిన జింకా చంద్ర కూలి పనిచేసుకొని జీవించేవాడు. ఇతనికి బద్వేలులోని శ్రీకృష్ణ దేవరాయ నగర్‌లో 5 సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలాన్ని ఎవరైనా కబ్జా చేస్తారని, స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటుకు శనివారం కడప నుంచి సిమెంటు ప్లేట్లు, స్తంభాలు తీసుకొని కూలీలతో బొలెరో పికప్ లగేజి వాహనంలో బద్వేల్‌లుకు బయలుదేరాడు. వాహనం సిద్దవటం గ్రామ శివారులోని ఉషా గార్డెన్ వద్దకు రాగానే ఎదురుగా ఎద్దు రావడంతో దాన్ని తప్పించబోయి అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జింకా చంద్రకు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు అబ్దుల్‌బార్, ఆర్‌బాజ్, అఫ్సర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అయితే జింకా చంద్ర చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజల్లోకి ప్రజా వ్యతిరేక విధానాలు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి

వేంపల్లె : ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను జగనన్న మిషన్ సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలోని మధురెడ్డి కల్యాణ మండపంలో జగనన్న మిషన్ లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు చేస్తున్న మోసాలు, అరాచకాలను ఎండగట్టే సమయం దగ్గర పడిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగనన్న ఎక్కడికి వెళ్లినా ప్రజాదరణ తగ్గలేదన్నారు. అధికారం లేనప్పుడు చంద్రబాబు సమావేశం పెడితే జనాలు రాని పరిస్థితి ఉండేదని, ఆ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుచేసుకోవాలన్నారు. జగనన్న ఒక్కసారి ప్రజల్లోకి అడుగు పెడితే చంద్రబాబు గాలికి కొట్టుకొనిపోతాడన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ5 లాంటి మీడియా, పత్రికలు భజన చేస్తున్నాయన్నారు. జగనన్న మిషన్ సోషల్ మీడియా ప్రతినిధులెవరూ కూడా కేసులకు భయపడవద్దని, వైఎస్సార్‌సీపీ జెండా మోసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇస్తామని తెలిపారు. పులివెందులలో సైతం రాజశేఖరరెడ్డి విగ్రహానికి జెండాలు కట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డప్ప గారి రమేష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలారెడ్డి మాట్లాడుతూ గతంలో 60లక్షల మందికి పింఛన్లు ఇచ్చారని, ఇప్పుడు సూపర్ సిక్స్ పథకమైన గ్యాస్ సబ్సిడీ కూడా రాలేదని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా ఆచూకీ కనపడలేదని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మునీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరి, కో ఆప్షన్ మెంబర్ పత్తి రాజేశ్వరి, ఆలూరు మాజీ మున్సిపల్ మాజీ చైర్మన్ శశికళ, జగనన్న మిషన్ ఫౌండర్ చిన్న సైదులు, జగనన్న మిషన్ డైరెక్టర్ రాఘవ రెడ్డి, విష్ణు, ఆదిత్య, మాజీ జెడ్పీటీసీ బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ, ఈశ్వరరెడ్డి, తుషార్ నాగిరెడ్డి, రోహన్ నాగిరెడ్డి, రాజశేఖర్ రెడ్డిలతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, జగనన్న సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

చేతులెత్తేసిన కూటమి సర్కార్

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం టీడీపీ, జనసేన, బీజేపీలు ఇష్టారాజ్యంగా హామీ ఇచ్చాయి. అందులో సూపర్ సిక్స్ పేరుతో పెట్టిన పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూర్చుతామని అసత్య ప్రచారం చేసి అధికారంలోకి వచ్చాయి. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజలకు వెన్నుపోటు పొడిచింది.. అని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మూడు మండలాలకు చెందిన పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో ప్రజలకు పథకాలు అందించారన్నారు. గతంలో బటన్ నొక్కే ముఖ్యమంత్రి అంటూ ప్రచారం చేశారని, ప్రస్తుతం చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, బీజేపీలు కలిసి ప్రజలకు ఆడబిడ్డ పథకం, నిరుద్యోగభృతి, రైతులకు రూ.20వేలు ఇస్తామని చెప్పి ఇంత వరకు ఒక్కపైసా కూడా జమ చేయలేదన్నారు. సూపర్ సిక్స్‌తోపాటు 143 హామీలను కూటమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈనెల 4వతేదీ వెన్నుపోటు దినంగా చేపట్టబోయే కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు, ప్రజలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్‌లను విడుదల చేశారు. జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, నాయకులు

మీ సేవలు చిరస్మరణీయం

పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బంది వీడ్కోలు సమావేశంలో జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్


పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందిని సత్కరించి వీడ్కోలు పలుకుతున్న ఎస్పీ

కడప అర్బన్ : సుదీర్ఘ కాలంపాటు పోలీస్ శాఖకు విశేష సేవలందించి పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మే నెలాఖరున పదవీ విరమణ పొందిన వి.మోహన్ రావు ఏ.ఎస్.ఐ (ఒంటిమిట్ట పి.ఎస్), పి.భాస్కర్ ఏ.ఎస్.ఐ (జమ్మలమడుగు పి.ఎస్), ఈ.రామన్న ఏ.ఆర్.హెచ్.సి 484, (డీ.ఏ.ఆర్, కడప), బి.నారాయణ హెచ్.సి 1956 (కడప టూ టౌన్ పి.ఎస్) లను జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ శాలువా కప్పి సన్మానించి జ్ఞాపికలు అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ పోలీస్ శాఖలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం సేవ చేస్తూ పదవీ విరమణ పొందడం అదృష్టమన్నారు. విధి నిర్వహణలో అందించిన సేవలే ఉద్యోగానంతరం కూడా గుర్తుండిపోయేలా మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తాయన్నారు. విధి నిర్వహణలో అప్పటి కఠిన పరిస్థితుల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం సాధారణ విషయం కాదని, నిబద్ధత, అంకిత భావంతో జిల్లా పోలీస్ శాఖకు అందించిన సేవలను శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా మీరు పోలీసు కుటుంబంలో సభ్యులేనని, భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లవేళలా తోడుగా ఉంటుందని జిల్లా ఎస్.పి భరోసా ఇచ్చారు. సకాలంలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్.పి బి.రమణయ్య, ఎ.ఆర్. డీఎస్పీ కె. శ్రీనివాసరావు, ఆర్.ఐ ఆనంద్, వీరేష్, శ్రీశైల రెడ్డి, శివరాముడు, టైటస్, డి.పి.ఓ ఏ.ఓ జ్యోతి, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలం కల్లమల్ల పోలీసు స్టేషన్ పరిధిలోని కృష్ణా నగర్ కాలనీకి చెందిన సుస్మిత అనే యువతి అదృశ్యమైనట్లు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కృష్ణా నగర్ కాలనీలో నివాసం ఉంటున్న కులాయప్ప కుమార్తె ప్రొద్దుటూరులోని ఎస్ఆర్ఐటీ కాలేజీలో మొదటి సంవత్సరం డిప్లొమో చదువుతోంది. శనివారం తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

– అదనపు కట్నం వేధింపులే కారణం


మృతి చెందిన భాగ్యలక్ష్మి

ధర్మవరం అర్బన్ : అదనపు కట్నం కోసం అత్తింటి వారు పెడుతున్న వేధింపులు భరించలేక వివాహిత తన పుట్టింటిలో ఆత్మహత్య చేసుకుంది. ధర్మవరం టూటౌన్ సీఐ రెడ్డప్ప వివరాల మేరకు... వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లి మండలానికి చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ చిన్న నరసింహులుకు ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి(31)తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. పెళ్లయిన కొంతకాలం తర్వాత నుంచి అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తమామలు సుబ్బమ్మ, పెద్ద నరసింహులు వేధించడం మొదలు పెట్టారు. పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు కూడా చేశారు. అయినా మెట్టినింటి వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో భాగ్యలక్ష్మి 20 రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. మనోవేదనకు గురైన భాగ్యలక్ష్మి శనివారం ఇంట్లోనే ఉరివేసుకుంది. మృతురాలి తల్లి కొండమ్మ ఫిర్యాదు మేరకు మెట్టినింటి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

లోతైన దుక్కులతో ఎంతో మేలు


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : రుతుపవనాల ఆగమనంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయని, రైతులందరూ లోతైన దుక్కులు చేసుకోవాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా చింతకొమ్మదిన్నె మండలం నాగిరెడ్డిపల్లె గ్రామంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేసే పంటలకు సంబంధించి విత్తన ఎంపిక ఎంతో ముఖ్యమన్నారు. పంటల సాగుకు ముందు కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. భారత నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మంగేష్ దుబే మాట్లాడుతూ ఖరీఫ్ పంటల సాగుకు ముందు రైతులు అధికారుల సూచనలు, సలహాలను పాటించాలన్నారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి.విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో నేల సమతుల్యతను కాపాడే విధంగా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. ప్రొద్దుటూరు పశు వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులు, టీకాలు, అలాగే గొర్రెలు, మేకల పెంపకంలో జాగ్రత్తల గురించి వివరించారు. ఉద్యానశాఖ టెక్నికల్ అధికారి జ్యోతిర్మయి ఉద్యాన రంగంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కే.సాయి మహేశ్వరి, డాక్టర్ సురేష్ కుమార్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శైలజ, మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్ రెడ్డి, సిబ్బంది తరుణ్, చంద్రారెడ్డి, ఆత్మ ఏటీఎం రైతులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగర శివార్లలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే 31 నుంచి జూన్ 19 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 4వ తరగతిలో మొత్తం 40 సీట్లకు బాలురు-20, బాలికలు-20, 5 వ తరగతిలో మొత్తం 40 సీట్లకు బాలురు-20, బాలికలు -20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

3 కేజీల గంజాయి స్వాధీనం

ఐదుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్, సిబ్బంది

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో గంజాయి కలిగి ఉన్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కడప పాత బస్టాండులోని రవీంద్రనగర్ బ్రిడ్జి వద్ద గంజాయి కలిగి ఉన్నారన్న సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించామన్నారు. పఠాన్ బిలాల్ అహ్మద్, సయ్యద్ మహబూబ్ బాషా, షేక్ అర్షద్, సయ్యద్ మహమ్మద్ ఉమర్, షేక్ మహ్మద్ రఫీ అనే ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి మూడు కేజీల గంజాయితో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. ఈ ఐదుగురిలో ఒక్కొక్కరిపై ఒడిస్సా రాష్ట్రం, కడప వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటికే పలు గంజాయి కేసులు ఉన్నాయన్నారు. ప్రధాన నిందితుడిగా ఉన్న పఠాన్ బిలాల్ అహ్మద్ భవన నిర్మాణ కూలీగా, సయ్యద్ మహబూబ్ బాషా, షేక్ అర్షద్ టీ హోటల్‌లో మాస్టర్‌గా, సయ్యద్ మహ్మద్ ఉమర్ ఏసీ మెకానిక్‌గా, షేక్ మహ్మద్ రఫీ వస్త్ర దుకాణంలో పని చేస్తూ గంజాయి విక్రయాలు సాగిస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐలు టి. మహేంద్ర, నరసింహారావు, సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను గుర్తించాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

అట్లూరు : అవధూత కాశిరెడ్డి నాయన భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. పోరుమామిళ్ల పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాశినాయన మండల పరిధిలోని జ్యోతి క్షేత్రం ఆవరణంలో భక్తుల అవసరాల నిమిత్తం ఎన్నో దశాబ్దాల క్రితం నిర్మించిన నిర్మాణాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అటవీ అధికారులు కూల్చి వేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాశిరెడ్డి నాయన భక్తుల ఆందోళన ఫలితంగా తొలగించిన నిర్మాణాలను యధాతథంగా నిర్మించడంతో పాటు ఆగిన బస్సు సర్వీసులను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు. హామీ అమలు కాకపోవడంతో శాసన మండలి సమావేశంలో ప్రస్తావించినా సరైన సమాధానం లేదన్నారు. అలాగే ఇటీవల బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని కలిసి భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని కూల్చిన నిర్మాణాలను నిర్మించుకునేందుకు అలాగే అక్కడ అవసరమైన మేర స్థలాన్ని కేటాయిస్తూ అనుమతులు మంజూరు చేయాలని కోరామన్నారు. త్వరితగతిన జ్యోతి క్షేత్రానికి అనుమతులు రాని ఎడల ఎంపీలతో కలసి పార్లమెంటు దృష్టికి తీసుకెళతామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాళ్లపల్లి నరసింహులు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు రాజీవ్‌బాషా, కాశినాయన మండల నాయకులు రమణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళలపై దాడులను అరికట్టాలి


సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

ప్రొద్దుటూరు : దళిత మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, దాడులను అరికట్టాలని రాష్ట్ర మాలమహానాడు కమిటీ జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ తెలిపారు. శనివారం స్థానిక పాత బస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర మాలమహానాడు నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై అధికారుల వేధింపులు, దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రతి నెల ఆర్డీఓ సమక్షంలో దళిత వాడల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా స్పందన కార్యక్రమంలో దళితుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా జిల్లాకు ఒక అధికారిని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్ కుమార్, గౌరవాధ్యక్షుడు సుద్దపల్లి మురళీప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గున్నంపాటి వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెల్లికట్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని శాంతినగర్ బ్రిడ్జిపై శనివారం రాత్రి కడప వైపు నుంచి వస్తున్న లారీని తిరుపతికి వెళ్తున్న మ్యాక్స్ వాహనం ఢీ కొనడంతో డ్రైవర్ షేర్ (50) అక్కడికక్కడే మృతి చెందాడు.

గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు
అటానమస్ హోదా


అటానమస్ హోదా పత్రాలను చూపిస్తున్న డైరెక్టర్ నాగూర్, ప్రిన్సిపాల్ రామసుబ్బమ్మ

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులకు అందిస్తున్న విద్యాప్రమాణాలను గుర్తించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తమ కళాశాలకు అటానమస్ హోదా కల్పించిందని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ నాగూర్ తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 29 నుంచి ఐదేళ్లపాటు అటానమస్ హోదా తమ కళాశాలకు ఉంటుందన్నారు. గత 16 ఏళ్లుగా తమ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థినులకు ఉద్యోగాలు రావడానికి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కళాశాలకు స్వయంప్రతిపత్తి కల్పించడం వల్ల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, రీసెర్చ్ ఓరియెంటెడ్ కార్యక్రమాలకు దోహదపడుతుందన్నారు. క్యాంపస్ సెలక్షన్స్, ఉద్యోగాల ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. కళాశాలకు అటానమస్ హోదా రావడానికి కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామసుబ్బమ్మ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థినులకు అందుతున్న నాణ్యమైన బోధన వల్ల 2023లో న్యాక్ బీ ప్లస్ లభించిందని తెలిపారు. ఈ ఏడాది అటానమస్ హోదా లభించిందన్నారు. మొదటి, ద్వితీయ సంవత్సరాల నుంచి విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ చేయిస్తామని తెలిపారు.

విద్యాశాస్త్రంపై అవగాహనతోనే విజయాలు


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జేవీవీ నాయకులు

కడప కల్చరల్ : విద్యా శాస్త్రంపై అవగాహనతోనే మానవాళికి విజయాలు దక్కగలవని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు రవీంద్ర అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 15 రోజులుగా జరుగుతున్న వేసవి వినోదం శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలల భవిష్యత్తు సమాజ అవసరాలతో ముడిపడి ఉందన్నారు. సాంకేతిక, సాంస్కృతిక అవసరాల రీత్యా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, పరిశీలనాత్మక శక్తులను పెంచడంలో తోడ్పడగలవన్నారు. విజ్ఞానాన్ని సరదాగా ఎలా నేర్చుకోవచ్చో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజాద్ అలీ తెలిపారు. శిబిరంలో విద్యార్థులకు పలు శాస్త్రీయ ప్రయోగాలు, చిత్రలేఖనం, పాటలు, మ్యాజిక్, ఓరిగామి తదితర అంశాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్లు, ఐద్వా జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బమ్మ , రిసోర్స్ పర్సన్స్ ప్రసాద్ రెడ్డి, శిరీష, రంగనాయకులు, కామేశ్వరమ్మ, గఫూర్, సమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.